ట్రాఫిక్‌ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



గచ్చిబౌలి: రోడ్డు భద్రతలో భాగంగా విద్యార్థులకు వినూత్న రీతిలో గచ్చిబౌలి ట్రాఫిక్‌ పోలీసులు అవగాహన కల్పించారు. గురువారం విప్రో జంక్షన్‌లో గచ్చిబౌలి స్కూల్‌, కేంబ్రిడ్జ్‌ స్కూల్‌ విద్యార్థులు ట్రాఫిక్‌ నిబంధనలు వివరించారు. జంక్షన్‌లో ట్రాఫిక్‌ క్రమ శిక్షణ, ప్రాథమిక ట్రాఫిక్‌ నిర్వాహణను వివరించారు. సిగ్నల్స్‌ పనితీరు, జంక్షన్లు, రోడ్లపై ఉన్న గుర్తులను అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. పాదాచారుల భద్రతను వాహదారులు గుర్తించాలన్నారు.

నందకుమార్‌ దంపతులకు పరామర్శ



శేరిలింగంపల్లి: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ నందకుమార్‌ యాదవ్‌, అనురాధ దంపతులను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీయూపీయూఎస్‌) రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు పరామర్శించారు. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురి కాగా పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీయూపీయూఎస్‌ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాశీరావు, రమేష్‌, మంచాల, శేరిలింగంపల్లి ప్రతినిధులు పాల్గొన్నారు.

‘బీసీబంద్‌’కు సగర సంఘం మద్దతు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌

గచ్చిబౌలి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ 18న తెలంగాణ బీసీ జేఏసీ ఇచ్చిన బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌ సగర వివరించారు. గచ్చిబౌలిలో విలేకరులతో మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. రాజ్యాంగ సవరణ చేసి చట్టపరంగా ఈ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

విద్యుత్‌ అధికారుల బస్తీబాట

రాయదుర్గం: విద్యుత్‌ సమస్యలను వినియోగదారుల వద్దకు స్వయంగా వెళ్లి తెలుసుకోవడానికి గచ్చిబౌలి విద్యుత్‌ అధికారులు బస్తీబాట కార్యక్రమాన్ని నానక్‌రాంగూడలో నిర్వహించారు. గురువారం విద్యుత్‌ ఏఈ భాస్కర్‌రావు, ఎస్‌ఎల్‌ఐ రాజు, ఎల్‌ఐ రమేష్‌ బాబు, గణేష్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు ఎదురవుతున్న విద్యుత్‌ సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్‌ సరఫరాకు ఎలాంటి అంతరాయాలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

స్వదేశీ ఉత్పత్తులను ఆదరించాలి

మణికొండ: స్థానిక హస్తకళల అనుసంధానంతో అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీపడే స్వదేశీ ఉత్పత్తులను ఆదరించాలని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం ఆయన మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్‌ టౌన్‌షిప్‌లో సినీనటుడు మంచు మనోజ్‌, మాజీ ఎంపీ మధుయాష్కి, గౌడ్‌లతో కలిసి వస్త్ర దుకాణాన్ని ప్రారంభించారు. ప్రపంచ స్థాయి టెక్స్‌టైల్‌ వ్యాపారానికి హైదరాబాద్‌ నగరం వేదికగా మారుతుందన్నారు. నిర్వాహకులు కల్లెం రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం

జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి



పటాన్‌చెరు టౌన్‌: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమని అతిక్రమిస్తే రెండేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. పటాన్‌చెరు పరిధిలో పలుచోట్ల పొగాకు నియంత్రణపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పొగాకు వినియోగానికి అందరూ దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమే

- 69వ ఎస్‌జీఎఫ్‌ క్రీడోత్సవాల్లో కలెక్టర్‌ ప్రావీణ్య
- కామన్వెల్త్‌, ఒలింపిక్‌ క్రీడల్లో పతకాల సాధనకు కృషి చేయాలి: ఎంపీ రఘునందన్‌రావు



క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించిన కలెక్టర్‌, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పటాన్‌చెరు: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనని కలెక్టర్‌ ప్రావీణ్య పేర్కొన్నారు. పటాన్‌ చెరు మైత్రి క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి 69 వఎస్‌జీఎఫ్‌ క్రీడా పోటీలను గురువారం కలెక్టర్‌ ప్రావీణ్య క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎంపీ రఘునందన్‌ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ ప్రావీణ్య మాట్లాడుతూ...క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఈ మూడు రోజులు అత్యంత కీలకమని ఈ క్రీడల్లో రాణిస్తే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. చదువుతో పాటు విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఈ క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఎంపీ రఘునందన్‌ రావు మాట్లాడుతూ... ప్రపంచంలో అత్యధిక జనాభా మన దేశంలో ఉన్నప్పటికీ కామన్వెల్త్‌, ఒలింపిక్‌ క్రీడల్లో పథకాల పట్టికలో మన దేశం చివరి స్థానంలో ఉంటుందన్నారు. అలాంటి పరిస్థితి రూపుమాపేందుకు క్రీడాకారులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పటాన్‌చెరులో జరిగేలా ఆతిథ్యం కల్పించినందుకు స్థానిక ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం: అంజిరెడ్డి

విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల శారీరక మానసిక దృఢత్వంతోపాటు విద్య,ఉపాధి అవకాశాల్లో పుష్కలమైన అవకాశాలు వస్తాయని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి మాట్లాడుతూ... గత పది రోజులుగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విజయవంతం కోసం శ్రమించిన ఉపాధ్యాయులకు అధికారుల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు ఎస్పీ పరితోశ్‌ పంకజ్‌ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి తమ పాఠశాలలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ, క్రీడా శాఖల అధికారి ఖాసీం బేగ్‌, ఆర్డీఓ రాజేందర్‌, సంబంధిత శాఖ అధికారులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వాలీబాల్‌ ఆడి క్రీడను ప్రారంభించిన కలెక్టర్‌

ప్రభుత్వ పాఠశాలలో ‘స్టెమ్‌ల్యాబ్‌’ ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో ఆప్టమ్‌ఇండియా, హోప్‌ ఫౌండేషన్‌, విద్యాకమిటీ సభ్యులు, టీచర్లు

రాయదుర్గం: ఆప్టమ్‌ ఇండియా, హోప్‌ ఫౌండేషన్‌ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన ‘స్టెమ్‌ ల్యాబ్‌’ను గురువారం రాయదుర్గంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఆప్టమ్‌ ఇండియా ప్రతినిధి నితిన్‌ కశ్యప్‌, శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య ప్రారంభించారు. దీంతో పాటు స్మార్ట్‌ టీవీ, అన్ని తరగతులకు కావాల్సిన కాంటెంట్‌ని కూడా అందించారు. దీనిలో భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం సంబంధించిన అన్ని ప్రయోగాలకు కావాల్సిన పరికరాలు, మోడల్‌, రసాయనాలు, కాంటెంట్‌ చార్ట్‌లు ఉన్నాయి. ఎంఈఓ వెంకటయ్య మాట్లాడుతూ ఎన్‌జీఓ సంస్థలకు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం హర్షణీయమన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా



అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న జేసీబీ

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ కాజీపల్లి గ్రామ సమీపంలోని సర్వే నంబర్‌ 181లో అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయన్న ఫిర్యాదులపై రెవెన్యూ, పోలీసులు స్పందించి ఉక్కుపాదం మోపాయి. ఈ మేరకు గురువారం జిన్నారం తహసీల్దార్‌ దేవదాసు ఆదేశాలతో మున్సిపల్‌, రెవెన్యూ యంత్రాంగం సంయుక్తంగా అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో పూర్తిగా నేలమట్టం చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించే క్రమంలో అవసరమైతే క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రవీందర్‌ రెడ్డి, ఆర్‌ఐ జైప్రకాష్‌ నారాయణ, రెవెన్యూ, పోలీస్‌ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజయం సాధించిన తిరుచి యూనిట్‌ టీం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటిని స్ఫూర్తిగా ముందుకు సాగాలని భెల్‌ కమ్యూనిటీ సెంటర్‌ అధ్యక్షుడు, జనరల్‌ మేనేజర్‌ టి.నందు అన్నారు. గురువారం రాత్రి కమ్యూనిటీ సెంటర్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన భెల్‌ ఇంటర్‌ యూనిట్‌ వాలీబాల్‌ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయం సాధించిన తిరుచి యూనిట్‌ జట్టుకు బహుమతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు నిలయం భెల్‌ టౌన్‌షిప్‌ అని అన్నారు. ఈ క్రీడా మైదానంలో ఆడిన అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించారని గుర్తు చేశారు. భెల్‌ కార్మికులు అన్ని రంగాల్లో రాణించేలా యాజమాన్యం ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జీఎం డాక్టర్‌. సంధ్యాకర్‌, సీసీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌, అధికారులు రవీందర్‌, సత్యబాబు పాల్గొన్నారు.

‘నేడు చలో రాజ్‌భవన్‌ విజయవంతం చేయండి’



కూకట్‌పల్లి: బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసి రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్‌లో చేర్చాలని కూకట్‌పల్లి సీపీఎం మండల కమిటీ డిమాండ్‌ చేసింది. శ్రీశ్రీనగర్‌ కార్యాలయంలో గురువారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకులు, మండల కార్యదర్శి ఎం. శంకర్‌ హాజరై మాట్లాడుతూ.. ఈనెల 17న చలో రాజ్‌భవన్‌ కార్యక్రమం ఉందని, పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, బీసీ మేధావులు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం. శంకర్‌, సభ్యులు, యు. శివప్రసాద్‌, పి. ధర్మారావు, ఏ. రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై సమీక్ష

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ రోడ్డు నంబర్‌–51లో సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు కాగా ఈ రోడ్డు పనుల సమయంలో ట్రాఫిక్‌ మళ్లింపులు, రోడ్డు తవ్వకాలపై జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లు గురువారం ట్రాఫిక్‌ డీసీపీ రాహుల్‌హెగ్డె.. వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి ఇక్కడ పర్యటించారు. పనులు ప్రారంభమైతే తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. రోడ్డుకు ఒకవైపు పెద్ద పెద్ద చెట్లు ఉండటం వల్ల రోడ్డు ఇరుగ్గా మారిందని, కొత్త రోడ్డు వేసినా ఉపయోగం ఉండదని, వాటిని రీలొకేట్‌ చేయాలని ట్రాఫిక్‌ పోలీసులు సూచించారు. ఒకవైపు ఫుట్‌పాత్‌ను కూడా తొలగించి రోడ్డును విస్తరించాలని సూచించారు.

జేఎన్‌టీయూలో శాంతిర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ప్రొఫెసర్స్‌, విద్యార్థులు

బాలానగర్‌: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్‌ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ వై. పూరణ్‌కుమార్‌, ఐపీఎస్‌ ఆత్మహత్యపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ జేఎన్‌టీయూహెచ్‌ హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ సెల్‌ ‘ర్యాలీ ఫర్‌ ట్రూత్‌ అండ్‌ అకౌంటబిలిటీ’ పేరుతో గురువారం శాంతి ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు, సిబ్బంది క్యాంపస్‌ ప్రధాన ద్వారం నుంచి ప్రారంభించి అంబేడ్కర్‌ విగ్రహం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కె. విజయకుమార్‌ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ పదవుల్లోని వారిని ప్రతిఒక్కరూ తప్పనిసరిగా గౌరవించాలన్నారు. జేఎన్‌టీయూహెచ్‌ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. జేఎన్‌టీయూహెచ్‌ అడ్మిషన్స్‌ డైరెక్టర్‌ బి. బాలునాయక్‌ మాట్లాడుతూ.. ఈ దాడి రాజ్యాంగ విలువలకు అవమానకరమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ బి. క్రాంతికిరణ్‌, డాక్టర్‌ డి. వసుమతి, డాక్టర్‌ ఎం. సుష్మ, డాక్టర్‌ ఇ. రాంజీ, డాక్టర్‌ ఎల్‌. సైదానాయక్‌, బోధనేతర సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిజం భవిష్యత్తుపై సెమినార్‌ నేడు, రేపు

బంజారాహిల్స్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ వర్సిటీలో ఈ నెల 17, 18వ తేదీల్లో ఏఐ యుగంలో జర్నలిజం భవిష్యత్తు–సవాళ్లు–అవకాశాలు’ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్‌ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సెమినార్‌లో సాంకేతికత పెరుగుతున్న కొద్దీ జర్నలిజం రంగంలో వస్తున్న మార్పులు, ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చిస్తారని పేర్కొన్నాయి. శుక్రవారం మొదటి రోజు సెమినార్‌ను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, అదనపు డీజీ, పీఐబీ శృతిపాటిల్‌ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే శనివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ వి.బాలకిష్టారెడ్డి, విశిష్ట అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌ కె.శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

రోడ్లు అస్తవ్యస్తం.. ప్రయాణం నరకం



మాదాపూర్‌లోని గఫూర్‌నగర్‌లో..



దుర్గం చెరువు వద్ద ..

మాదాపూర్‌లో ఇదీ పరిస్థితి

మాదాపూర్‌: అంతర్జాతీయ సదస్సులకు, ఐటీ ప్రాంతాలకు నిలయంగా ఉన్న మాదాపూర్‌ ప్రధాన రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. లక్షల రూపాయలను వెచ్చించి పనులను చేపట్టినప్పటికీ నాణ్యతా లోపం వల్ల ప్రయోజనం లేకుండా పోతోంది. మరమతులు చేసిన కొద్ది రోజులకే తిరిగి గుంతల మయంగా మారుతున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మాదాపూర్‌లోని గఫూర్‌ నగర్‌, సాయినగర్‌, శ్రీ వేంకటేశ్వర కళాశాల పరిసర ప్రాంతాలలో రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి. అధికారులు ఇప్పటికైనా పట్టించుకొని రోడ్లకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

అరకొర నీటి సరఫరాతో అవస్థలు..!

జర్నలిస్టుకాలనీలో నీటి కటకట

నిజాంపేట్‌ : ‘పేరు గొప్ప.. ఊరు దిబ్బ’ అన్నట్లుగా తయారైంది నిజాంపేట్‌ జర్నలిస్టు కాలనీ పరిస్థితి. 20 రోజుల క్రితం వరకు నీటి సరఫరా బాగానే జరిగినప్పటికీ ఆ తర్వాత నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాల్సి ఉండగా 4 రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన లైన్‌మెన్‌ కాలనీవాసుల అవసరాలకు మేరకు నీటిని వదిలేవారు. అయితే 20 రోజుల నుంచి పాత లైన్‌మెన్‌ స్థానంలో కొత్తవారు రావడంతో వారికి ఏమాత్రం అవగాహన లేదు. ఏ వాల్వ్‌స్‌ ఓపెన్‌చేస్తే ఎటువైపు నీరు వెళ్తాయో తెలియడం లేదు. ఫలితంగా కొంతమందికి నీరు వస్తే, మరికొంతమందికి నీటి సరఫరా కావడం లేదు. ఒకవేళ నీరు వచ్చినా లో ప్రెషర్‌తో అరగంట పాటు ఇచ్చి బంద్‌ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై జలమండలి సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జలమండలి సిబ్బంది స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ముక్కర్ల లాలయ్య, కాలనీవాసులు కోరుతున్నారు.

వంతెనపై చెత్తను తొలగించండి



మున్సిపల్‌ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

మణికొండ: గండిపేట చెరువు గేట్లు ఎత్తటంతో మూసీనదిలోని చెత్తా, చెదారం కొట్టుకుని వచ్చి మంచిరేవుల గ్రామానికి వెళ్లే వంతెనకు అడ్డుగా నిలిచిందని, దాన్ని తొలగించాలని బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు నార్సింగి మున్సిపల్‌ కమిషనర్‌ కృష్ణమోహన్‌రెడ్డిని కోరారు. పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కమీషనర్‌ను గురువారం కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. చెత్తను తొలగిస్తే ప్రజల రాకపోకలకు ఇబ్బంది తొలుగుతుందన్నారు. మైనార్టీ విభాగం నియోజకవర్గ ఇంచార్జి ముక్తార్‌పాష పాల్గొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో యువకుడి మృతి



శివకుమార్‌ మృతదేహం

మణికొండ: కాసెపట్లో ప్రారంభించాల్సిన జిమ్‌ వద్ద హైమాస్ట్‌ లైట్లను ఏర్పాటు చేస్తున్న ఇద్దరు ఎలక్ట్రీషియన్లకు విద్యుత్‌ ప్రమాదం జరగటంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.ఈ సంఘటన గురువారం రాత్రి నార్సింగి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు.. గంధంగూడ హిమగిరినగర్‌ కాలనీకి చెందిన శివకుమార్‌,(25), గుడిమల్కాపూర్‌కు చెందిన శివలు హైదర్‌షాకోట్‌లో గురువారం రాత్రి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ చేతులమీదుగా ప్రారంభించాల్సిన జిమ్‌ వద్ద హైమాస్ట్‌ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆ క్రమంలో లైట్లను బిగించేందుకు ఓ ఇనుప పైప్‌ పైకి ఎత్తటంతో అది విద్యుత్‌ వైర్లకు తగిలింది. దాంతో దాన్ని పట్టుకుని ఉన్న శివకుమార్‌, శివలు కింద పడిపోయారు. శివకుమార్‌ అక్కడికక్కడే మృతి చెందగా, శివను హుటాహుటిన లంగర్‌హౌస్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం విషయం తెలుసుకుని మృతుని కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకోవటంతో గందరగోళం ఏర్పడింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. జిమ్‌ ఓనర్‌ రాకేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

చందానగర్‌ : మియాపూర్‌–2 ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్‌ వెంకటేశం గౌడ్‌ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. డిపో పరిధిలోని మియాపూర్‌, బాచుపల్లి, మల్లంపేట్‌తో పాటు నిజాంపేట్‌ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీస్‌ సేవల సంబంధించి తమ సమస్యలతో పాటుగా సూచనలు సలహాలు తెలిపేందుకు డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959226420 ఫోన్‌ నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్‌ : హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు. ఇంద్రారెడ్డి ఆల్విన్‌ కాలనీ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 01.00 గంట వరకు సమత కోఆపరేటివ్‌ హౌసింగ్‌ సొసైటీ, ఇంద్రారెడ్డి ఆల్విన్‌ కాలనీ, బీహెచ్‌ఈఎల్‌ హెచ్‌ఐజీ ఉషోదయ కాలనీ, మైత్రీనగర్‌ ఫేజ్‌–1 ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

22 నుంచి కార్తీక మాసోత్సవాలు



రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి దేవాలయంలో ఈనెల 22 నుంచి నవంబర్‌ 20 వరకు కార్తీక మాసోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహక ప్రతినిధి రవీందర్‌రెడ్డి తెలిపారు. టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయంలో గురువారం కార్తీక మాసోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నెల రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో స్ఫటిక శివలింగమునకు విశేషంగా అభిషేకం నిర్వహిస్తామన్నారు.

మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ను కలిసి ‘ఎస్కీ’ బృందం



రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ నేరెళ్ళ శారదను గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా డైరెక్టర్‌ డాక్టర్‌ జి రామేశ్వరరావు నేతృత్వంలో గురువారం ఎస్కీ బృందం కలిసింది. ఎస్కీ–తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌ మధ్య పరస్పర సహకారం, అవగాహన కార్యక్రమాలు, భాగస్వామ్యం అవకాశాలపై చర్చించారు.